ప్రజాశక్తి
శుక్రవారం 6 సెప్టెంబర్ 2024 5
శ్రీ సత్యసాయి

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్

# క్రికెట్ సంబరం ఆరంభం

◆ మొదటి రోజు బౌలర్లదే హవా
◆ అక్షర్ పటేల్ ఆల్‌రౌండర్ షో

◆ వీక్షకులపై 'ధరాభారం'
◆ పాస్‌ల జారీపై సీనియర్లలో అసంతృప్తి
◆ రెండేళ్ల పిల్లలకూ పాస్ ఉండాల్సిందే..!

మ్యాచ్‌ను వీక్షిస్తున్న క్రికెట్ అభిమానులు

**ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి**

దులీప్ టోర్నీ సంభరం ఆరంభమైంది. అనంతపురం నగరంలోని ఆర్డీటీ స్పోర్ట్సు కాంప్లెక్సు క్రికెట్ గ్రౌండ్‌లో సి, డి టీమ్‌ల మధ్య మ్యాచ్ గురువారం ప్రారంభమైంది. సి టీమ్ టాస్ గెలిచి మొదట ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదటి రోజు మ్యాచ్‌లో బౌలర్ల హవా కొనసాగింది. ఒక్క రోజు వ్యవధిలోనే 14 వికెట్లు పడ్డాయి. టాస్ ఓడి మొదట బ్యాటింగుకు దిగిన డీ టీమ్ ఆరంభం నుంచి వికెట్లు పడుతూ వచ్చాయి. ఏడవ ఆటగాడిగా బరిలోకి దిగిన అక్షర పటేల్ 86 పరుగులు చేయడంతో 164 పరుగులకు అలౌట్ అయ్యింది. శ్రేయస్ అయ్యర్ 9 పరుగులకే అవుట్ అయ్యి నిరాశ పరిచాడు. డి టీమ్‌లో విజయ్ కుమార్ వైశాక్ మూడు వికెట్లు, అన్సులన్ కాంబోజన్ 2, హిమాన్సు చౌహాన్ 2, మనవ సుతార్, హృతిక్ షోకీన్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సి జట్టు కూడా ఎదురీదుతోంది. 33 ఓవర్లలో 91 పరుగులు చేసి నాలుగు వికెట్లు కోల్పోయింది. హర్షిత్ రాణా, అక్షర పటేల్ చెరో రెండు వికెట్లు పడ్డాయి.

**అక్షర్ మెరుపు ఇన్నింగ్స్**

7వ నెంబర్ ఆటగాడిగా బరిలో దిగిన అక్షర్ పటేల్ మెరపు ఇన్నింగ్స్ ఆడాడు. మొదట్లో నెమ్మదిగా ఆడుతూ ఆ తర్వాత వేగం పెంచాడు. అవకాశం దొరికినప్పుడల్లా బంతిని బౌండరీ, సిక్సర్‌గా మలిచాడు. లాంగ్ ఆఫ్ మీదుగా కొట్టిన ఓ సిక్సర్ స్టేడియం బయట పడింది. 118 బంతులు ఎదుర్కొని 6 ఫోర్లు, 6 సిక్సర్ల సహాయంతో 86 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అతనికి తోడుగా అర్షదీప్ సింగ్ 13 పరుగులు చేశాడు. అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్ 9వ వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

**పాస్‌ల జారీపై సీనియర్లలో అసంతృప్తి**

మ్యాచ్‌ను చూసేందుకు ప్రేక్షకులకు అనుమతికోసం ఉచితంగా పాసులు మంజూరు చేశారు. ఈ పాసులు విషయంలో అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యుల్లోనే అసంతృప్తి నెలకొంది. వారికి కూడా పాసులు ఇవ్వకుండా కొద్ది మందికి మాత్రమే వీటిని ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో మ్యాచ్ నిర్వహణ ఏర్పాట్లలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు అంటీముట్టనట్టుగా వ్యవహరించడం గమనార్హం. అదే విధంగా మీడియాకు జారీ చేసిన బిసిసిఐ పాసుల్లో కూడా తప్పిదాలు దొర్లాయి. ఇప్పటికీ కొద్ది మంది మీడియా ప్రతినిధులకు పాసులు జారీ అవలేదు. రెండేళ్ల పిల్లాడికి కూడా పాస్ ఉండాలని చెప్పడంతో తల్లిదండ్రులు ఇబ్బంది పడ్డారు. మ్యాచ్ చూడాలని చిన్న పిల్లలతో వచ్చిన తల్లిదండ్రులు రెండేళ్ల పిల్లాడికి కూడా పాస్ ఉండాలని చెప్పడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై పిఆర్ఒ రాజగోపాల్‌ను అడుగగా వేల పాసులు మంజూరు చేసే సమయంలో తప్పిదాలు జరుగుతుంటాయంటూ చాలా తేలిగ్గా చెప్పడం గమనార్హం.

**వీక్షకులపై ధరాభారం**

దులీప్ ట్రోఫి టోర్నీ చూసేందుకు ఉచితంగా పాసులను నిర్వాహకులు పంపిణీ చేశారు. ఇవి అందుకున్న అభిమానులు పెద్దఎత్తున మైదానంకు విచ్చేశారు. ప్రధానంగా యువత, చిన్నారులు అధికంగా వచ్చారు. ఉదయం 10.30 గంటల తరువాత ప్రధాన గేటుకు తాళాలు వేశారు. మ్యాచ్ చూసే సమయంలో తినుబండారులు ఏమైనా తినాలంటే మాత్రం ధరలు ఆకాశాన్ని అంటే విధంగా ఉన్నాయని అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐదు రూపాయలు విలువ చేసే సమోస రూ.10లకు అమ్మగా, పది రూపాయల ఐస్ క్రీమ్ రూ.50, శీలపానీయాలు రూ.50గా, వేరుశనగ పప్పులు రూ.20, చిన్నపాటి బిస్కెట్ ప్యాకెట్ రూ.20, భోజనం తదితర అన్నింటిపైనా రెండు, మూడు రెట్లు అధిక ధరలు వసూలు చేశారు. స్టేడియం వద్ద అన్ని రకాల తిండిపదార్థాల ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో ఏమైనా తినాలన్న వీక్షకుడు ఆలోచించుకునే పరిస్థితి నెలకొంది.

# సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం

**సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్**
**నిరవధిక సమ్మెలో శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు**

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

శ్రీసత్యసాయి, శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు, సి పి డబ్ల్యు ఎస్, ఆర్ డబ్ల్యు ఎస్ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ హెచ్చరించారు. గురువారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో తాగునీటి పంపు హౌస్ వద్ద కార్మికులు నిరసన దీక్ష చేపట్టారు. అంతకు ముందు కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేష్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న కార్మికులకు 6 నెలల నుంచి వేతనాలు ఇవ్వకుంటే వారు కుటుంబాలను ఎలా పోషిస్తారని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టులో దాదాపు 700 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. కార్మికులు తమ సమస్యలను పలుమార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ పథకాన్ని నీరు కార్చే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికులు 'ముఖ్యమంత్రి చంద్రబాబు మమ్ములను కాపాడండి, ప్రాజెక్టు కొనసాగించండి' అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం లో సిఐటియు నాయకులు, సత్యసాయి వాటర్ సప్లై వర్కర్ల సంఘం గౌరవాధ్యక్షులు లక్ష్మీనారాయణ, పైపల్లి గంగాధర్, పెడపల్లి బాబా, వర్కర్ల యూనియన్ అధ్యక్షుడు మధుసూదన్, నాయకులు ప్రభు, శ్రీనివాస్, ఆదినారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు.

**పుట్టపర్తి రూరల్ :** సత్యసాయి, శ్రీరామి రెడ్డి తాగునీటి పథకాల నీటి సరఫరా కార్మిక కుటుంబాలు బజారు పాలు కావడానికి ప్రధాన కారణం గత ప్రభుత్వం చేసిన తప్పిదాలేనని గ్రీన్ భారత్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రెడ్డివారి శంకర్ నారాయణ విమర్శించారు. పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం శ్రీ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాల వలనే కార్మికుల కుటుంబాలకు శాపంగా మారిందని 6 నెలల నుండి వేతనాలు లేక వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నాయని అన్నారు. 15 రోజుల నుండి వీరు నిరసన వ్యక్తం చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వెంటనే కార్మికులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు.

**కొత్తచెరువు :** సత్యసాయి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. కొత్త చెరువు ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని పంప్ హౌస్ వద్ద 15 రోజుల నుండి తమ సమస్యలను పరిష్కరించాలని కార్మికులు నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. తక్షణమే వేతనాలు పెంచి పెండింగ్ లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు షెక్షావలి, చాంద్‌భాషా, తాగునీటి కార్మికుల సంఘం నాయకులు సలీం,రాము, జయ పాల్గొన్నారు

జెసిబి పనులను ప్రారంభిస్తున్న మంత్రి భర్త వెంకటేశ్వరరావు

## శరవేగంగా హంద్రీనీవా గండి పూడ్చివేత

**పెనుకొండ :** నగర పంచాయతీ పరిధిలోని కోనాపురం సమీపంలో హంద్రీనీవా కాలువకు గండి పడింది. దీంతో డిఇ రామచంద్రమూర్తి, ఎఇ చౌడయ్య ఆధ్వర్యంలో గురువారం మరమ్మతులు ప్రారంభించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు గండి పడింది. దీంతో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీటి విడుదల సాధ్యం కాకపోడంతో బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత హంద్రీనీవా గండి పూడ్చే పనులకు రూ. 9 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు మంత్రి భర్త వెంకటేశ్వరరావు మరమ్మతులను ప్రారంభించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మడకశిర బ్రాంచ్ కెనాల్‌లోని ఎల్-5 వద్ద 23వ కిలోమీటర్ సమీంలో వైసిపి ప్రభుత్వంలో చేపట్టిన పనులు నాసిరకంగా ఉండడంతో కొద్దిపాటి వర్షానికే కాలువకు గండిపడిందన్నారు. దీంతో నీటి సరఫరా నిలిచిపోవడంతో మంత్రి చొరవ తీసుకుని ప్రభుత్వం నుంచి నిధుల మంజూరు చేయించగా గండి పూడ్చే పనులు ప్రారంభించామన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ ద్వారా అన్ని చెరువులకు సాగునీరు అందించడం ద్వారా తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. పని జరుగుతున్న ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పనులు నాణ్యతగా చేయాలని ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లకు సూచన చేశారు. కార్యక్రమంలో సిబ్బంది గణేష్, టిడిపి నాయకులు త్రివేంద్ర, కోనాపురం సుబ్రహ్మణ్యం, కాంట్రాక్టర్ రవి, ప్రసాద్, పెద్దన్న, గంగన్న, గోపాల్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి పల్లెకు సన్మానం

**బుక్కపట్నం :** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిని మండల టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రిని కలిసి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఉత్తమ అవార్డుల గ్రహీత అయిన పల్లె రఘునాథరెడ్డి తన కళాశాలల ద్వారా ఎంతోమందికి విద్యను అందించి,బావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. కార్యక్రమంలో గంగాధర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'పురం'లో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ

**హిందూపురం :** హిందూపురంలో ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ అండర్ - 15 బాల బాలురు ఛాంపియన్ షిప్ టోర్న మెంట్ పోటీలు నిర్వహించనున్నట్లు అనంతపురం జిల్లా బ్యాడ్మింటన్ సమాఖ్య అధ్యక్షులు బుగ్గయ్య చౌదరి, ఉపాధ్యక్షులు డి.ఆర్. వెంకటేష్, షఫీ, కార్యదర్శి జయకుమార్ గురువారం తెలిపారు. పట్టణంలోని దండు రోడ్డులో ఉన్న ఎస్.పి. ఆర్. బ్యాడ్మింటన్ అకాడమీ ఇండోర్ స్టేడియం, మంజు బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10న స్థానిక ఎస్‌పిఆర్ స్టేడియంలో ఈ టోర్నీ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.

## మార్చి లోపు గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి : పీడీ

**పెనుకొండ** : ప్రభుత్వం మంజూరు చేసినా అసంపూర్ణంగా ఉన్న గృహ నిర్మాణాలను మార్చి లోపు పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటనారాయణ ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోని భువన విజయం సమావేశ భవనంలో పిడి గురువారం గృహ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. పిడి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన గృహ నిర్మాణాలకు బిల్లులు మంజూరు చేస్తామన్నారు. వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేసి బిల్లులు తీసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. సమావేశంలో ఎఈ శ్రీనాథ్, తహశీల్దార్ శ్రీధర్, మాజీ జడ్పిటిసిలు నారాయణస్వామి, మునిమడుగు వెంకటరాముడు, మాజీ ఎంపిపి కేశవయ్య, పట్టణ పార్టీ కన్వీనర్ శ్రీరాములు, లక్ష్మీనారాయణరెడ్డి, షౌకత్, కౌన్సిలర్ గిరి, గీతాహనుమంతు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ పిడి వెంకటనారాయణ

# ప్రజల పక్షపాతి ప్రజాశక్తి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-మడకశిర**

ప్రజల పక్షపాతి ప్రజాశక్తి అని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. పట్టణం లోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో గురువారం ఎమ్మెల్యే రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తితో కలిసి ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాశక్తి పత్రిక ప్రజల పక్షాన నిలుస్తూ ప్రతి అక్షరం ప్రజల వైపు ప్రచురిస్తూ దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. సిద్ధాంతాలకు కట్టుబడి నీతి, నిజాయితీతో నిర్భయంగా అవినీతి అక్రమాలను వెలికి తీసి సమాజాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ఏకైక పత్రిక ప్రజాశక్తి అన్నారు. విలువలతో కూడిన పత్రికలకు మంచి భవిష్యత్తు ఉంటుందని అలాంటి పత్రికలను ప్రజలు ఆదరిస్తార న్నారు. ప్రజాశక్తి పత్రికను కొన్నేళ్లుగా చదువుతున్నామని అందులో వాస్తవాలు తప్ప అవాస్తవాలు ఉండవన్నారు. కార్యక్రమంలో ప్రజాశక్తి దినపత్రిక ఎడిషన్ మేనేజర్ వేణుగోపాల్, పెనుగొండ డివిజన్ ఇన్‌ఛార్జి ఆర్.తిమ్మప్ప, ప్రజాశక్తి పాత్రికేయులు హెచ్.గోవిందప్ప, బి.నాగరాజు, లోకేష్, టిడిపి డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, మనోహర్, స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ అక్కంపల్లి బాబు, బేగార్లపల్లి రవికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు , మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి నాయకులు, ప్రజాశక్తి సిబ్బంది

# ఉత్తమ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి-పెనుకొండ టౌన్**

పుట్టపర్తి మండలంలోని జగరాజు పల్లిలో ఉన్న మంగళకర కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్, ఎమ్మెల్యే పల్లె సింధుర రెడ్డి, డిఇఒ మీనాక్షి, డివైఇఒ రంగస్వామి, ఆర్‌డిఒ భాగ్యరేఖ నుంచి ఇస్లాపురం పిఎస్ హెచ్‌ఎం పి.కృష్ణా నాయక్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులకు యుటిఎఫ్ జిల్లా శాఖ తరపున అభినందనలు తెలిపారు.

**రొద్దం :** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం పుట్టపర్తిలోని ఉపాధ్యాయ భవనంలో సరస్వతమ్మ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు. ఈమె మండలంలోని పెద్ద గువ్వలపల్లి హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. సరస్వతి జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకొన్నారు. దీంతో పాఠశాల సిబ్బంది, బంధువులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్, ఎమ్మెల్యే పల్లె సింధుర రెడ్డి, డిఇఒ మీనాక్షి, డివైఇఒ రంగస్వామి, ఆర్‌డిఒ భాగ్యరేఖ నుంచి అవార్డు అందుకుంటున్న పి.కృష్ణానాయక్, సరస్వతమ్మ

## ఘనంగా ఫ్రెషర్స్ డే.. ఉపాధ్యాయ దినోత్సవం

**ప్రజాశక్తి -పెనుకొండ టౌన్**

పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి ఆధ్వర్యం లో ప్రెషర్స్ డే, ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బాలాజీ విద్యా సంస్థ ల అధినేత పల్లె వెంకట కృష్ణకిషోర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్, వైస్ ప్రిన్సిపల్ నరసింహ మూర్తి హాజరయ్యారు. పల్లె వెంకటకృష్ణ కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పరిధిలో జరిగిన సాఫ్ట్ బాల్, స్పోర్ట్స్‌లో వివిధ విభాగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అశోక్, ఎఒ కేశవయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైసిపి బోయ, వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్ర

**పెనుకొండ టౌన్ :** వైసిపి వాల్మీకి, బోయ సంఘం విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పొగాకు రామచంద్రను నియమిస్తూ గురువారం కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పొగాకు రామచంద్ర మాట్లాడుతూ తనను వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బోయ, వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వాల్మీకి, బోయల సమస్యల పరిష్కారానికై అనునిత్యం కృషి చేస్తానని ఆయన తెలిపారు.

విద్యార్థిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-మడకశిర**

గ్రామీణ ప్రాంత విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు సూచించారు. పట్టణంలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన ప్రెషర్స్ డే కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గతేడాది ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే శాలువా, పూలమాలలతో సన్మానించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి వ్యవసాయం, కూలీ పనులు చేసి పిల్లలను చదివిస్తున్నారని, విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగితే వారి కష్టానికి తగిన ప్రతిఫలం అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూమికి అనుగుణంగా పంటలు సాగు చేయాలి

**అమరాపురం :** భూమికి అనుగుణం గా పంటలు సాగు చేయాలని సీనియర్ శాస్త్రవేత్త ఈ.చంద్రాయుడు, శాస్త్రవేత్తలు యుగంధర్, శిరీష, హరిణి సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం ఆవరణలో గురువారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో వక్క రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన శాస్త్రవేత్తలు నూతన వంగడాలతో కూడిన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సీనియర్ శాస్త్రవేత్త చంద్రాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులకు వ్యవసాయం, పంటల సాగుపై అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ ప్రాంతంలో 6 వేల ఎకరాల్లో వక్కసాగును ప్రోత్సహించడంతో పాటు అంతర పంటగా మిరియాల సాగును ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గణేష్, ప్రధాన కార్యదర్శి జయరామప్ప, ఎంపిటిసి ఓంకారస్వామి, నరసింహమూర్తి, శివరుద్రప్ప, మంజునాథ్, కృష్ణమూర్తి, జయకుమార్, చంద్రప్ప, కాంతరాజు పాల్గొన్నారు

సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త చంద్రాయుడు

## పర్యావరణాన్ని కాపాడుకుందాం : కలెక్టర్

**పుట్టపర్తి అర్బన్ :** ప్రతి ఒక్కరూ మట్టి గణపతి ప్రతిమతో వినాయకచవితి జరుపుకుని పర్యావరణాన్ని కాపాడుకుందామని కలెక్టర్ టిఎస్. చేతన్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాలో పర్యావరణం, మట్టి గణపతి వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి పలువురికి మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఏపీ కాలుష్యం నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ సహజ రంగులతో తయారుచేసిన మట్టి వినాయకుని విగ్రహాలు పూజించి తద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందాం అన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు : సిఐ

**పెనుకొండ :** ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిఐ రాఘవన్ హెచ్చరించారు. సిఐ గురువారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సిఐ మాట్లాడుతూ ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ లైసెన్స్, ఆటో ఇన్సూరెన్స్ కలిగి ఉండాన్నారు. మహిళలు, బాలికల పట్ల మర్యాదగా నడుచుకోవాల న్నారు. అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటి సహాయం కావాలంటే తనను సంప్రదించాలన్నారు.

**ప్రజాశక్తి కథనానికి స్పందన**

## మురుగు తొలగింపు

**రొద్దం :** మండలంలోని ఆర్.మరవపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో తహశీల్దార్ కార్యాలయం సమీపం లో రోడ్డుపై నిలిచిన మురుగు నీటిని పంచాయతీ సిబ్బంది తొలగించారు. ప్రజాశక్తి దినపత్రికలో గురువారం 'ఇళ్ల మధ్యలో మురుగు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్ ఆధ్వర్యంలో పంచాయితీ కార్యదర్శులు రమేష్, లక్ష్మినారాయణ పంచాయితీ సిబ్బంది చేత రోడ్డుపై ఉన్న మురుగు తొలగింపు చర్యలు చేపట్టారు. అలాగే బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎమ్మెల్యే

**కొత్తచెరువు :** మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేను ఎంపిపి సన్మానించారు. ఈ సమావేశంలో శాఖల వారీగా నివేదికలను చదివి వినిపించారు ఇందులో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా పలువురు సభ్యులు తమ పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈసమావేశంలో ఎంపీడీవో బారన్ సాహెబ్, తహశీల్దార్ నాగరాజు, వ్యవసాయ అధికారి నటరాజు, విద్యుత్ ఏఈ వెంకటేష్‌తో పాటు ఆయాశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

## ఆలయ అభివృద్ధికి విరాళం

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

కదిరి రూరల్ మండలంలోని కుమ్మరవండల పల్లిలోకొండ కింద ఉన్న అంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి వైసిపి బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తల హరి ప్రసాద్ విరాళం అందజేశారు. తనవంతుగా 50 వేల రూపాయలను ఆయన సతీమణి డాక్టర్. సజని కుమారి ద్వారా డాక్టర్ రామ్ ప్రసాద్ చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కె.ఉల్లాగన్న రావ్. కాంట్రాక్టర్ బాబా , చికెన్ జాకీర్, కిరణ్, బాబ్జాన్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గ్రామోత్సవం

**ప్రజాశక్తి - బత్తలపల్లి**

మండలంలోని మాల్యవంతం గ్రామంలో గురువారం శ్రీకృష్ణుడి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, సేవా సమితి కమిటి అధ్యక్షులు మాలపాటి సూర్యనారాయణ. సభ్యులు పత్తిపాటి రంగానాయుడు. బాలిరెడ్డి, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు ఏకరువు

**ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు**

మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సంబందిత సర్పంచులు, ఎంపిటిసిలు ఏకరువు పెట్టారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి పర్వీన్‌బాను అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసిలు తమ పరిధిలో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబందిత శాఖల అధికారులకు ఎంపిపి ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వరలక్ష్మితో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సామగ్రి పంపిణీ

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

మండల పరిధిలోని జగరాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం విద్యాసామాగ్రిని సత్యసాయి భక్తుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పుట్టపర్తి కి చెందిన శ్రీ వాణిబ్లో సమ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెన్నులు, పలకలు, పుస్తకాలు, స్టేషనరీ వస్తువులను అందజేశారు. గాజులపల్లి ప్రాథమిక పాఠశాల, దండువారి పల్లి గ్రామానికి చెందిన 60 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. అనంతరం ప్రాథమిక పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో అవీన్ మీరా శ్రీవాణి, శ్రీనివాస్, హనుమాన్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టపర్తిలో రూ.6 కోట్లతో తాగునీటి పథకం పనులు

పైపులైను పనులను భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

**ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్**

మున్సిపాలిటీ పరిధిలో అమృత పథకం కింద రూ.6 కోట్లతో తాగునీటి పథకం పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూర తెలిపారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని రావుహౌస్ కాలనీలో రూ.9.52 లక్షలతో చేపట్టిన ప్రత్యేక తాగునీటి పైపులైనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీలో రూ. 6 కోట్లతో అమృత పథకం క్రింద సమగ్ర తాగునీటి పథకం ద్వారా పుట్టపర్తి ప్రజల దాహార్తి తీరుస్తామన్నారు. జిల్లా కేంద్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం దశలవారీగా నిధులు విడుదల చేస్తోందన్నారు. రూ. 5 లక్షలతో పట్టణంలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే పట్టణంలో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని, త్వరలో కొత్త చెరువులో అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తామని అన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గం అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టపర్తి అభివృద్ధికి తగిన తోడ్పాటు అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రహ్లాద, ఈఈ నరసింహమూర్తి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, మాజీ పుడా చైర్మన్ కడియాల సుధాకర్, 10వ వార్డు కౌన్సిలర్ వెంకటరమణమ్మ, రాష్ట్ర మైనార్టీ నాయకుడు మహమ్మద్ రఫీ, కాంట్రాక్టర్ రాఘవయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పల్లె సింధూర

## వంద రోజుల ప్రణాళికను విజయవంతం చేద్దాం

**ప్రజాశక్తి-హిందూపురం**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల ప్రణాళికను జిల్లా వ్యాప్తంగా ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు సమన్వయం చేసుకుని నిర్దేశించిన గడువు లోగా పూర్తి చేయాలని పీడీ విజయేంద్ర ప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో హిందూపురం క్లస్టర్ వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులపై ఏపీడీ శివానంద నాయక్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో పీడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంటేషన్ కార్యక్రమంలో రాష్ట్రంలోని సత్యసాయి జిల్లా చివరి స్థానంలో ఉంది అన్నారు. దీనిని ప్రథమ స్థానంలో నిలపడానికి ప్రతి ఒక్కరూ కషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ వెంకప్ప, క్లస్టర్ వ్యాప్తంగా ఉన్న ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## వరద బాధితులకు అండగా నిలబడదాం : ఎస్‌ఎఫ్‌ఐ

**ప్రజాశక్తి-హిందూపురం**

వరద బాధితులను ఆదుకునేందుకు అన్ని వర్గాలు ముందుకు రావాలని ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి కోరారు. వరద బాధితులు ఆదుకునేందుకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణకు శ్రీకారం చుట్టారు. హిందూపురం పట్టణంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజ మాన్యాలు, విద్యార్థుల దగ్గర గురువారం విజయవాడ వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాజా, విశ్వనాథ్, మోమిన్ భాష తదితరులు పాల్గొన్నారు.

విరాళాలు సేకరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

వినాయక విగ్రహాల ఊరేగింపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్పీ, తదితరులు

## చవితి వేడుకలకు పటిష్ట భద్రత : ఎస్పీ

**ప్రజాశక్తి - కదిరి అర్బన్**

వినాయక చవితి వేడుకలను ఐకమత్యంతో ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ వి.రత్న సూచించారు. గురువారం కదిరి డీఎస్పీతోకలిసి ఎస్పీ కదిరిలో వినాయక విగ్రహాల ఏర్పాట్లు, నిమజ్జనం సమయంలో ఊరేగింపుగా వెళ్లే కాలనీలు, నిమజ్జన చేసే ప్రాంతాలను పరిశీలించారు. మసీదుల వద్ద ముస్లిం మత పెద్దలతో పాటు హిందువులతో మాట్లాడారు. వినాయక విగ్రహాల ఏర్పాట్లు, ఊరేగింపు, నిమజ్జనం సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఊరేగింపు నిమజ్జనం జరిగే ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. ఊరేగింపుగా వెళ్లే ప్రాంతాలు లక్ష్మీనరసింహస్వామి దేవాలయం అక్బర్ రియా మసీదు, అల్లంబాత్ మసీదు రైల్వే స్టేషన్ ,శివాలయం, తో పాటు, పట్టణంలో ఏర్పాటు చేసే పెద్ద విగ్రహాల ప్రాంతాలైన సింహం కోట, ఎర్రకోట ప్రాంతాలు, నిమజ్జనం చేసే ప్రాంతమైన రామనారాయణ కుంట ప్రాంతాలను ఎస్పీ పరిశీలించి, ఆ సమయాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రత పరమైన అంశాలు ,ట్రాఫిక్ నిబంధనలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీలత, సిఐలు నారాయణరెడ్డి నాగేంద్ర, మోహన్, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఎస్ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘాల ఏర్పాటుకు అవకాశం

**ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్**

జిల్లాలో చేనేత కార్మికులు కొత్తగా సహకార సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని చేనేతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చేనేత జౌళి శాఖ అధికారి రమేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మునిసిపాలిటీ పరిధిలో 50 మంది కార్మికులు సంఘాలుగా ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాలలో అయితే కనీసం 30 మంది అయినా ఉండాలన్నారు. సంఘం పెట్టుబడిగా ఒక్కొక్కరు వెయ్యిరూపాయలు సభ్యత్వ రుసుం తీసుకోవాలన్నారు.

## ఇసుక ట్రాక్టర్లు సీజ్

**ప్రజాశక్తి- పరిగి**

పరిగి మండలంలోని జయమంగళి, పెన్నా నదుల నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 12 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ రంగడు తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను కోర్టు పరిధిలో ఉంచినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రాంతం నుండి ఎక్కువ సంఖ్యలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని వాటిని కట్టడి చేయాలని స్థానికులు మంత్రి సవితమ్మకు పలుసార్లు ఫిర్యాదు చేశారు. మంత్రి ఆదేశాలతో ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించిన పోలీసులు దాడులు నిర్వహించి ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు.

## పేకాట జూదరులు అరెస్టు

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

మండల పరిధిలోని వీరాపురం శివారు కర్నాటక సరిహద్దులో పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న 11,200 నగదు,4 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కొంత మంది పారిపోయారని వారిని త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు.

## ప్రత్యామ్నాయ విత్తనాలకు రిజిస్ట్రేషన్

**ప్రజాశక్తి - బత్తలపల్లి**

వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట సాగు చేయని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 80శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు అందిస్తోందని ఎఒ ఓబిరెడ్డి తెలిపారు. అర్హులైన రైతులు ప్రత్యామ్నాయ విత్తనాల కోసం సంబంధిత రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

## జపాన్‌లో ఉద్యోగావకాశాలు

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డి), నావిస్ హెచ్ఆర్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామని జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎఎన్ఎం, జిఎన్ఎమ్, బిఎస్సి నర్సింగ్ చదివిన విద్యార్థులకు జపానీస్ భాష ఎన్ 5, ఎన్, ఎన్3 స్థాయిలలో నేర్పించి, వారికి జపాన్ దేశంలో నర్సులుగా ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు వారు తెలిపారు. జపాన్ దేశంలో ఉద్యోగం చేయడానికి ఆసక్తి కలిగిన, 32 సంవత్సరాలు లోపు వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణ కాలం 6 నెలలని, శిక్షణ నావిస్ హెచ్ఐర్ బెంగళూరులో జరుగుతుందని, శిక్షణ ఫీజు 3,50,000 అని చెప్పారు. పాక్షిక శిక్షణ రుసుం 50 వేలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ 25,000 రూపాయిలు చెల్లిస్తుందని మిగిలిన 25,000 రూపాయలు అభ్యర్థి చెల్లించాలని ,మిగిలిన 3లక్షల రూపాయలు మూడు విడతలుగా అభ్యర్థి చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జపాన్ దేశంలో ఉద్యోగ అవకాశం కల్పించటానికి కావాల్సిన సదుపాయాలను ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావిస్ హెచ్ఆర్ పర్యవేక్షిస్తుందని వివరించారు. ఉద్యోగం పొందిన అభ్యర్థి వేతనం రూ. 1.10 లక్షల నుంచి రూ.1.40 లక్షల వరకు ఉంటుదనితెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కొరకు చైతన్య కుమార్‌రాజు సెల్‌నెంబరు 9398643930కు గాని, టోల్ ఫ్రీ నెంబర్ 99888 53335నెంబర్‌కు గాని సంప్రదించాలన్నారు.

## కళాశాలను సందర్శించిన న్యాక్‌బృందం

**ప్రజాశక్తి-హిందూపురం**

పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను గురువారం న్యాక్ టీమ్ సందర్శించింది. బృంద సభ్యులు డాక్టర్ మృణాళిని ఫడ్నవీస్, డాక్టర్. కమలాక్షి, డాక్టర్. యశోధరా శర్మ కళాశాలను సందర్శించారు. రికార్డులను పరిశీలించి అవసరమైన సూచనలిచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి, ఐక్యూఎసి సమన్వయకర్త ఎస్.శ్రీలక్ష్మి తొలుత పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కళాశాల అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దివాకర్ రెడ్డి, అభివృద్ధికమిటి సభ్యులు డాక్టర్. రామూర్తి, విద్యాసాగర్, గోవిందరెడ్డి, అనుష తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ సంస్కృతిలో గురువు స్థానం విశిష్టం

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న కలెక్టర్

కదిరి ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పరిగిలో అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న దృశ్యం

## ఉపాధ్యాయ దినోత్సవంలో వక్తలు

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

భారతీయ సంస్కృతిలో గురువు స్థానం ఎంతో విశిష్టమైనదని ప్రతి ఒక్కరి విజయం వెనుక గురువు ఉంటాడని జిల్లా కలెక్టర్ టిఎస్. చేతన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మంగళకర ప్రాథమిక పాఠశాల సమావేశపు మందిరంలో విద్యా శాఖ ఆధ్వర్యం లో ఘనంగా గురు పూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, డిఇఒ మీనాక్షి, ఆర్డీవో భాగ్య రేఖ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఓబుల్ పతి, డిప్యూటీ డిఇఒ రంగస్వామి, ఇతర శాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గురువు స్థానం ఎంతో విశిష్టమైనదని, ప్రతి విద్యార్థి విజయం వెనుక ఉపాధ్యాయుల ప్రభావం ఉంటుందని అన్నారు. పిల్లల భవిష్యత్తును ముందుగా గుర్తించేది ఉపాధ్యాయులు మాత్రమే అన్నారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వత్తికి ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**కదిరి టౌన్ :** సమాజంలో ఎంతోమందిని ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దేది గురువులని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కదిరి రూరల్ మండలంలోని కుమ్మరవాండ్లపల్లిలో హరీష్ స్కూల్స్ వారి స్పేస్ కళాశాలలో మానసధార సేవా సమితి వ్యవస్థాపకులు యం.యస్. ప్రశాంత్, హరీష్ స్కూల్ ప్రిన్సిపల్ కిరణ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంటతో పాటు మాజీ ఎమ్మెల్యే కడపల మోహన్ రెడ్డి, ఆయన సతీమణి డాక్టర్ పద్మిని, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్. పార్థసారథి, జనసేన పార్టీ కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతో పాటు క్రమశిక్షణకు మారుపేరు హరీష్ పాఠశాల అన్నారు. ప్రతి విద్యార్థి విజయం వెనుక ఉపాధ్యాయుల ప్రభావం ఎక్కువ ఉంటుందన్నారు. సమాజాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందాదుల్లా ఖాన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

**నల్లచెరువు:** విద్య అనేది తరగని ఆస్తి అని బ్రిలియంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఉపాధ్యాయులు అన్నారు. స్థానిక బ్రిలియంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో కరస్పాండెంట్ కార్తీక్, హెచ్ఎం శ్రీనివాసులుచ ఉపాధ్యాయులు అనిల్ నాయక్, నాగేంద్ర, లక్ష్మి, సుమియా, గౌతమి తదితరులు పాల్గొన్నారు

**బుక్కపట్నం :** నేటి తరం ఉపాధ్యాయులకు సర్వేపల్లి రాధాకృష్ణ ఆదర్శప్రాయుడని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వర ప్రసాద్, శ్రీనివాసులు, ఓబులేసు, రాజ మహమ్మద్, ఓబయ్య, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

**గాండ్లపెంట :** స్థానిక ఎంఆర్‌సి భవన్ లో గురువారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు నివాళులుఅర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కృష్ణానాయక్,ఉపాధ్యాయులు రాజశేఖర్, రమణారెడ్డి, రమేష్, ఖాదర్‌భాషా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

**చిలమత్తూరు :** భావి తరాల భవిష్యత్తు నిర్దేశకులు గురువులని టిడిపి మండల కన్వినర్ రంగారెడ్డి, ఎంఇఒ పద్మప్రియ అన్నారు. మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయదినోత్సవాన్ని మండల ఉపాధ్యాయ సంఘాల జేఏసి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత రెండు రోజులుగా ఉపాధ్యాయులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరేష్‌కృష్ణ, ఎంఇఒ సల్మాన్‌రాజ్‌తో ఉపాధ్యాయులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**కొత్తచెరువు :** స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గురువులను సన్మానించారు ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నూర్జహాన్, ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

**బత్తలపల్లి :** స్థానిక శ్రీ జ్యోతి హై స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షిరిడి సాయి స్కూల్ కరస్పాండెంట్ కొండన్న, జ్యోతి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు నాగ పెద్దిరాజు, శంకరయ్య, ఆదెప్ప, కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఓబుళదేవర చెరువు :** స్థానిక రెయిన్‌బో పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ జయచంద్రారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ జయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కదిరి టౌన్ :** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని బ్లూ మూన్ విద్యాసంస్థల అధినేత ఎం. శివశంకర్ పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణ జయంతి పురస్కరించుకొని మున్సిపాలిటీ పరిధిలోని బ్లూ మూన్ విద్యాసంస్థలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివశంకర్ ఉపాధ్యాయుల దినోత్సవ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా విద్యాసంస్థలో నిర్వహించిన పలు రకాల క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల సెక్రటరీ శ్రీదేవి , ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి, మాధవరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**పరిగి :** విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు గురువులు మార్గదర్శకాలని ఎంఇఒ లక్ష్మీదేవి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వెలుగు సమావేశ భవనంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను దివ్య ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పరిగి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు పొందిన మోద ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయిని కవితను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు లక్ష్మీదేవిచ శేషాచలం యుటిఎఫ్ మహంతిష్ తదితరులు పాల్గొన్నారు.

**హిందూపురం :** శ్రీ సత్య సాయి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పరిగి మండలం పైడేటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం సహాయకులుగా పనిచేస్తున్న జి ఆర్ శ్రీనివాసులును కలెక్టర్ చేతన్, జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి, పుట్టపర్తి శాసనసభ్యురాలు సింధూర రెడ్డి సన్మానించారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకష్ణన్ జయంతి సందర్భంగా పుట్టపర్తి సమీపంలోని జగరెడ్డి పల్లి వద్ద ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను సన్మానించారు.

**మొక్కలు పంపిణీ :** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురష్కరించుకుని గురువారం పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్స్ స్కూల్ లో పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు పాఠశాలలో ఉపాధ్యాయులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతు ప్రతి వ్యక్తిని చదువు అనే సాధనముతో ఉన్నత స్థాయికి చేర్చే శక్తే ఉపాధ్యాయులకే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నందకుమార్, ఎఒ భాస్కర్, సూపరిటెండెంట్ విజయేంద్ర, హెచ్ఎం గాయిత్రి, ఎహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదే విధంగా సువర్ణ భారతీ కళాశాలలో ప్రిన్సిపల్ నీలకంఠరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. అదే విధంగా పట్టణంలోని అన్ని విద్యాసంస్థల్లో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు జరుపుకున్నారు.రూరల్ మండలం చౌళూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో అప్‌గ్రేడ్ సిఐ ఆంజనేయులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన జనసేన నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు, అట్టలు, స్వీట్లు సిఐ ఆంజనేయులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ తిప్పేస్వామి, జనసేన నాయకులు ఆటో సోమ అశ్వర్థ, ఆటో రవి, చిరంజీవి,ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**రొద్దం :** మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళ్లకుంట ఎంపియుపి పాఠశాలలో ఉపాధ్యాయులు మల్లికార్జున, బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఉపాధ్యాయ దినోత్సవంలో సర్పంచి క్రిష్టప్ప, ఎస్ఎంసి ఛైర్మన్ నారాయణప్ప, అంగన్వాడీ టీచర్ అనూష తదితరులు కేక్ కట్ చేశారు. స్థానిక టీచ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో హెచ్ఎం తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, తిమ్మారెడ్డి, ఉపాధ్యాయులు బాలాజీ, నాగరాజు, హరీష్, అంజనరెడ్డి పాల్గొన్నారు. అలాగే మండలంలోని సానిపల్లి ఎంపియుపి పాఠశాలలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు మల్లికార్జున, వెంకటేష్‌లను పాఠశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖర్‌గౌడ్, నారాయణస్వామి, క్రిష్ణానాయక్, లక్ష్మీనరసమ్మ, జయమ్మ, సత్యమయ్య, లక్ష్మీనారాయణ, మోహన్‌రెడ్డి, ఎస్ఎంసి ఛైర్మన్ శ్రీనివాసులు , విద్యార్థులు పాల్గొన్నారు.

**పెనుకొండ :** ప్రగతి, గ్లోబల్ జైన్ పాఠశాలల్లో కరస్పాండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులను సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

**పెనుకొండ టౌన్ :** పట్టణంలోని శాంతినికేతన్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**గోరంట్ల :** పట్టణంలోని ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ భక్తవత్సలం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పిఒలు ఆజాద్, రఘునాథ్‌రెడ్డి, బాలమోహన్, అరవింద్, కవిత, లక్ష్మీ, శ్వేత, సుమలత, అర్షియా, రామ్మోహన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు

**గుడిబండ :** మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ జయచంద్రకుమార్, ఉపాధ్యాయులు కరియప్ప, జయరామిరెడ్డి, నరసింహప్ప, సోమశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయురాళ్లు గాయత్రి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

**సోమందేపల్లి :** స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు సి.కిష్టప్ప, ఎం.వెంకటేష్, ఎం.ఆదినారా యణలను సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఎపిటిఎఫ్ మాజీ స్టేట్ కౌన్సిలర్ జవ్వాజి నాగరాజు హాజరై మాట్లాడారు. ఈకార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షుడు దస్తగిరి, అధ్యక్షుడు చంద్ర, ప్రధాన కార్యదర్శి సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు

**మడకశిర :** ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఉపాధ్యాయ భవనంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రయోజకులమై ఉన్నత స్థానాలను అధిరోహించడమే అసలైన గురుదక్షిణ అన్నారు. ఈకార్యక్రమంలో ఎంఇఒలు భాస్కర్, శ్రీనివాసమూర్తి, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, పట్టణ అధ్యక్షుడు మనోహర్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు భక్తర్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత శివశంకర్



ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి సన్మానిస్తున్న ఉపాధ్యాయులు